

నేటి నుంచి పోషణ్ అభియాన్

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాలను నేటి నుంచి అక్టోబర్ 16 వరకు నిర్వహిస్తారు. 8లో



వెయిట్ లిఫ్టింగ్ పోటీలు షురూ

సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో ఉద్యోగులకు బాడీ బిల్డింగ్, వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. 8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమై కొన్నిచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై చొరవ తీసుకోండి

కేంద్ర మంత్రికి తుమ్మల వినతి



కేంద్ర మంత్రి రాంమోహన్‌నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న తుమ్మల

ఇల్లెందు/ఖమ్మంఅర్బన్: కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రాంమోహన్‌నాయుడుకు వివరాలు అందజేసి మాట్లాడారు. గతంలో గుర్తించిన స్థలం అనుకూలంగా లేదని తేల్చారని తెలిపారు. ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించిన నేపథ్యాన సర్వే చేయించాలని కోరారు. జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటైతే భద్రాచలం రామాలయానికి వచ్చే భక్తులే కాక సింగరేణి, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ పరిశ్రమలకు వచ్చివెళ్లే అధికారులకు అనువుగా ఉంటుందని తెలిపారు. అనంతరం కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డీ.కుమారస్వామిని కూడా కలిసిన తుమ్మల.. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, ఆవశ్యకతను వివరించారు.

కలెక్టరేట్‌లో నేడు ప్రజాపాలన దినోత్సవం

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉదయం 10 గంటలకు పతాకావిష్కరణ తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. వివిధ అభివృద్ధి పథకాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. అనంతరం 11.30 గంటలకు ములకలపల్లి మండలం మంగపేటలో నిర్వహించే జిల్లా స్థాయి ఆరోగ్య శిబిరంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు దమ్మపేట మండలం గండుగులపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారు.

రైతులు కూపన్లు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఏఓ బాబూరావు

ములకలపల్లి: పీఏసీఎస్‌లో యూరియా కొనుగోలు చేసే రైతులు.. ఏఈఓలు జారీ చేసే కూపన్లు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి. బాబూరావు సూచించారు. మండలంలోని పూసుగూడెం రైతువేదికలో ఏర్పాటు చేసిన యూరియా విక్రయ కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాస్ పుస్తకాలు వెంట తెచ్చుకోవాలని చెప్పారు. సొసైటీలతో పాటు రైతు వేదికల్లోనూ యూరియా విక్రయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇల్లెందు ఏడీఏ జి.లాల్‌చందర్, ఎంఏఓ అరుణ్‌బాబు, ఏఈఓ రజనీకాంత్, పీఏసీఎస్ సిబ్బంది మురళీ, నాగేంద్ర పాల్గొన్నారు.


లైసెన్స్ హక్కులకు 29న వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో వివిధ లైసెన్స్‌ల హక్కు మంజూరుకు ఈనెల 29న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ కె.దామోదర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు తానీషా కల్యాణ మండపంలోని కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు హాజరు కావాలని సూచించారు. గతంలో దేవస్థానానికి బాకీ, తగాదాలు ఉన్నవారు అనర్హులని పేర్కొన్నారు. వివరాలకు కార్యాలయ పనివేళల్లో 9515545354 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

నేడు ఖమ్మంలో సాయుధ పోరాట వారోత్సవాల సభ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో బుధవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. గత వారం రోజులుగా అమరవీరులకు నివాళులర్పించడమేకాక సభను విజయవంతమయ్యేలా ప్రచారం చేశామని వెల్లడించారు. ఈమేరకు బుధవారం జరిగే సభలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.బేబి, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.సుదర్శన్ రావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

తుది పోరులో రుధిర ధారలు



సాయుధ పోరాటం ఆపాలన్న భారత సర్కారు

- విప్లవబాట వీడబోమంటూ గెరిల్లాలుగా మారిన కమ్యూనిస్టులు
- ఈ పోరులో గెరిల్లాలకు అడ్డాగా మారిన జిల్లా
- చివరి దశలో భీకరపోరు..

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా.. హైదరాబాద్ సంస్థానం మాత్రం బ్రిటిష్ వారి సహకారంతో పాలన సాగిస్తున్న నిజాం రాజు చేతిలోనే ఉంది. అతడి సైన్యమైన రజాకార్లు తెలంగాణ వ్యాప్తంగా బీభత్సం సృష్టించారు. గ్రామాల్లో దమనకాండ సాగించారు. వారిని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు ఆంధ్ర మహాసభ నాయకత్వంలో పోరు సాగించారు. ఆయుధ శిక్షణ తీసుకుని నిజాం సైన్యాన్ని మట్టి కరిపించారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో కమ్యూనిస్టులు సైతం ప్రాణాలొదిలారు. ఇరు వర్గాల మధ్య భీకర పోరుతో నాడు పల్లెల్లో రక్తం ఏరులై పారింది. చివరకు 1948 సెప్టెంబర్ 17న నిజాం సైన్యం హైదరాబాద్ సంస్థానాన్ని వీడడంతో ఈ ప్రాంతం కూడా భారత్‌లో భాగమైంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పోలీస్ చర్యతో హైదరాబాద్ స్టేట్ భారత్‌లో విలీనమైనందున సాయుధ రైతాంగ పోరాటం ఆపేయాలని కమ్యూనిస్టులకు భారత ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అప్పటివరకు కమ్యూనిస్టులకు మద్దతుగా నిలిచిన వర్గాలు సైతం ప్రభుత్వ ప్రతిపాదనపై మొగ్గు చూపాయి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో పది లక్షల ఎకరాల భూమిని పేద రైతులకు పంపిణీ చేసి కమ్యూనిస్టులు బలంగా ఉన్నారు. పల్లెల్లో సంఘం ఎంతో కీలకంగా మారింది. రైతాంగ పోరాటం ఆపితే గ్రామాలను వదిలి పట్టణాలకు పారిపోయిన భూస్వాములు తిరిగి వస్తారని, అప్పటి వరకు చేసిన పోరాటం వృథా అవుతుందనే వాదనలు కామ్రేడ్ల నుంచి వినిపించాయి. అప్పటికి రాజ్యాంగం అందుబాటులోకి రాకపోవడంతో పోరాటం ద్వారా తాము పంపిణీ చేసిన భూమిని పేదలకు చట్టబద్ధంగా ఎలా పంచాలనే అంశంపై కమ్యూనిస్టులకు స్పష్టత లేదు. దీంతో సాయుధ పోరాటం కొనసాగించడమే మంచిదని నాటి నాయకత్వం నిర్ణయం తీసుకుంది.

ఆర్మీపై ఆరోపణలు

సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టు నాయకులు చేసిన ఆరోపణల ప్రకారం 1950 సెప్టెంబర్ 6న ఆళ్లపల్లి, ఇల్లెందు నుంచి ప్రత్యేక బలగాలు గుండాలకు వెళ్లి విప్లవకారులకు మద్దతుగా ఉన్న గ్రామాలపై విచక్షణారహితంగా దాడులు చేశాయి. గుండాల సమీపంలోని ముత్తాపురం – దొంగతోపు మధ్య ఆ రోజుల్లో పోలీస్ క్యాంప్ ఉండేది. దీన్ని కేంద్రంగా చేసుకుని సాయుధ పోరాటానికి మద్దతుగా ఉన్న గిరిజనులపై ఆర్మీ దమనకాండకు పాల్పడిందని చెబుతారు. ఆ తర్వాత ఆళ్లపల్లి ఆర్మీ క్యాంపు ద్వారా జరిగిన వివిధ ఆపరేషన్లలో మొత్తం 119 మంది రైతాంగ పోరాట వీరులు మరణించారు. అందులో ఒక్కరోజే 45 మంది చనిపోయారు. ఇక్కడ గెరిల్లా నుంచి ప్రతిఘటన ఎక్కువగా ఉండటంతో వైమానిక దాడులు జరిగినట్టుగా చెబుతారు. బెండాలపాడు గుట్టల్లో దాగి ఉన్న గెరిల్లాల ఆచూకీ కోసం అక్కడి ఆదివాసీ కుటుంబాలపై దాడులు జరిగాయి. గార్ల జాగీరులోని కట్టుగూడెంలోనూ అమానవీయ దాడులు చోటుచేసుకున్నాయి.

పోరాట విరమణ..

ఇరువైపులా అంతులేని హింస చెలరేగడంతో చివరకు 1951 అక్టోబర్ 21న సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నట్టు కమ్యూనిస్టులు ప్రకటించారు. దీంతో క్రమంగా శాంతి నెలకొనడం మొదలైంది. పోరాటం విరమించే సమయానికి జిల్లా పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో 50 మంది విప్లవకారులు, 500 మంది కోయ మిలిటెంట్లు మిగిలారు.



గెరిల్లా దాడుల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు..

- ఇల్లెందు – నర్సంపేట రోడ్డులో గంగారం దగ్గర మిలిటరీ లారీ పేల్చివేత. కారేపల్లి మిలిటరీ క్యాంపుపై దాడి.
- 1949 జనవరి 1న తల్లాడ – కొత్తగూడెంలో కాల్పులు, ఇద్దరు సైనికుల మృతి. ఏప్రిల్ 27న జరిగిన దాడిలో ఇద్దరు అధికారుల మరణం
- 1949 జనవరి 29న రోళ్లపాడు వద్ద పోలీస్ కాన్వాయ్‌పై దాడి.. ముగ్గురు పోలీసుల మృతి
- 1949 మార్చి 26న కొత్తగూడెం సమీపంలో పోలీసుల లారీపై కాల్పులు, నలుగురు మరణం
- ఇల్లెందులో బొగ్గు గనుల్లో ఉపయోగించే మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రంపై దాడి, భారీగా పేలుడు పదార్థాలు ఎత్తుకెళ్లిన విప్లవకారులు
- గెరిలా యుద్ధ తంత్రం రక్షణ చర్యల్లో భాగంగా 150 మైళ్ల మేర రోడ్ల ధ్వంసం

గెరిల్లాల ప్రధాన స్థావరంగా..

సుశిక్షితులైన, ఆధునిక ఆయుధ సంపత్తి కలిగిన భారత సైన్యం ముందు అల్పస్థాయిలో ఆయుధాలు, అంతంతగానే సైనిక శిక్షణ కలిగిన విప్లవకారులతో రైతాంగ పోరాటం చేయడం కమ్యూనిస్టులకు కష్టంగా మారింది. దీంతో గెరిల్లా పోరాటమే మార్గమని నాయకత్వం భావించింది. కరీంనగర్ జిల్లా గెరిల్లాలు మంథని అడవుల్లోకి వెళ్లగా.. నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన గెరిల్లాలు అటు నల్లమల ఇటు పాల్వంచ, ఇల్లెందు అడవుల్లో తలదాచుకున్నాయి. దీంతో 1949 ఫిబ్రవరి నాటికి సాయుధ రైతాంగ పోరాటానికి భద్రాద్రి జిల్లానే ప్రధాన స్థావరంగా మారింది. రెండు వందల గ్రామాల్లో విప్లవ సంఘాలు ఏర్పడ్డాయి. ఈ సాయుధ దళాలను వెదుక్కుంటూ భారత ఆర్మీ ఇక్కడి అడవులపై దృష్టి పెట్టింది. జిల్లా వ్యాప్తంగా మైసూర్ సైన్యం, గూర్ఖా పోలీసులతో కూడిన 30కి పైగా ఆర్మీ క్యాంపులు వెలిశాయి. ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలోనే పల్లెల్లో రక్తం ఏరులై పారింది.

3

చదువుతో పాటు కళల్లోనూ రాణించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన అధికారులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు చదువుతో పాటు కళల్లోనూ రాణించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో రెండు రోజుల పాటు జరగనున్న జిల్లా స్థాయి కళోత్సవం పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నప్పుడు తనకు కూడా కళల పట్ల ఆసక్తి ఉండేదని, కానీ వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోయానని తెలిపారు. నేటి విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటేనే భవిష్యత్ బాగుంటుందని సూచించారు. పిల్లలంతా తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవడానికి దారి చూపించేది ఇలాంటి పోటీలేనని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి మాట్లాడుతూ పిల్లలందరూ ఉత్సాహంగా పాల్గొని తీపి జ్ఞాపకాలను తమతో తీసుకెళ్లాలని సూచించారు. ఈ పోటీలలో సుమారు 200 మంది విద్యార్థులు 12 రకాల కళారూపాలను రెండు రోజులపాటు ప్రదర్శించనున్నారని తెలిపారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగ రాజశేఖర్ మాట్లాడుతూ.. మొదటి రోజు శాస్త్రీయ, జానపద నృత్యాలు, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్ 2డీ, 3డీ అంశాల్లో, రెండో రోజు గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, కథలు చెప్పడం వంటి పోటీలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు సతీష్ కుమార్, సైదులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛత’కు సర్వం సిద్ధం

- నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు
- జిల్లాలోని 471 పంచాయతీల్లో నిర్వహణ
- పల్లెలను వేధిస్తున్న నిధుల కొరత
- పనులు సజావుగా సాగేనా..?



శ్రమదానం చేస్తున్న అధికారులు, యువకులు (ఫైల్)

చుంచుపల్లి: దేశానికి పల్లెలే పట్టుగొమ్మలని చెప్పిన మహాత్మాగాంధీ జయంతి వేడుకల సందర్భంగా ప్రతి పంచాయతీలో స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యాన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను బుధవారం నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేయగా.. స్వచ్ఛోత్సవ్ – పక్షోత్సవాల పేరుతో కార్యక్రమాలు చేపట్టనున్నారు. జిల్లాలోని 471 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తారు. ఇందు కోసం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు పాల్గొని పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. 15 రోజుల పాటు నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతపై మానవహారాలు, స్వచ్ఛత పరుగు, ర్యాలీలు చేపట్టనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ స్థలాలు, కూడళ్లలో ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, శ్రమదానాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయడం వంటివి జరిపిస్తారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తారు.

ప్రధాన కార్యక్రమాల వివరాలిలా..

- పల్లెల్లో 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధాన కూడళ్లు, ప్రజోపయోగ స్థలాలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్త, మురుగు తొలగిస్తారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రజల శ్రమదానంతో పారిశుద్ధ్య పనులు చేపడతారు.
- కంపోస్ట్ షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేయడం, చెత్త నుంచి ప్లాస్టిక్, గాజు, ఇతర వస్తువులు తొలగించి మిగిలిన తడిచెత్త వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మారుస్తారు.
- అక్టోబర్ 2న చివరి రోజు గ్రామసభల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేలా ప్రత్యేక తీర్మానాలు చేస్తారు. వస్త్ర సంచులు వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు చేపడతారు. స్వచ్ఛత ప్రాధాన్యంపై విద్యాలయాల్లో క్విజ్ పోటీలు, విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపడతారు.

నిధుల సంగతేంటి..?

‘స్వచ్ఛతా హీ సేవ’ పేరుతో బుధవారం నుంచి వచ్చే నెల 2 వరకు 15 రోజులపాటు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో గ్రామ కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రతి పనికీ కార్యదర్శులే పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఇప్పుడు ఈ కార్యక్రమాలకు నిధుల లేమితో అడ్డంకులు ఏర్పడతాయనే భయం వారిని వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రోజువారీ ప్రణాళికలతో ముందుకు



జిల్లాలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. రోజువారీ ప్రణాళికలతో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి స్వచ్ఛ పల్లెలుగా మార్చడమే లక్ష్యం. ప్రజలు, అధికారుల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం.

– ఎం. విద్యాచందన, డీఆర్‌డీఓ

సృజనాత్మక బోధన అందించాలి

టీఎల్‌ఎం మేళాలో పీఓ రాహుల్



టీఎల్‌ఎం మేళాలో అభ్యసన పద్ధతులపై ఆరా తీస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: విద్యార్థులకు సృజనాత్మక బోధన అందించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటుచేసిన టీఎల్‌ఎం మేళాను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు వివిధ అంశాలను సులువుగా నేర్చుకునేందుకు ఈ ప్రక్రియ ఉపకరిస్తుందన్నారు. ఉద్దీపకం వర్క్‌బుక్–2 లోని సారాంశాలను సృజనాత్మక చిత్రాల ద్వారా అవగాహన కల్పించేందుకే ఈ మేళా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే భద్రాచలం, దమ్మపేట, ఇల్లెందు డివిజన్ల పరిధిలో ఈ మేళాలను నిర్వహించామని వెల్లడించారు. జిల్లా స్థాయి టీఎల్‌ఎం మేళాలో తెలుగు, గణితం, ఇంగ్లిష్ విభాగాల్లో ఉత్తమంగా ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులకు నగదు బహుమతులు అందిస్తామని వివరించారు. ప్రథమ బహుమతిగా రూ. 5,000, రెండో బహుమతి రూ. 3,000, మూడో బహుమతి రూ.2,000తో పాటు మెమెంటోలు అందిస్తామని తెలిపారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి..

నిరుద్యోగ గిరిజన యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని రాహుల్ అన్నారు. వైటీసీలో జరుగుతున్న వీడియో, ఫొటోగ్రఫీ శిక్షణను పరిశీలించిన పీఓ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం, ఐటీడీఏ అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాతృభాషపై పట్టు సాధించాలి..

భద్రాచలంటౌన్ : పిల్లల్లో సృజనాత్మక శక్తి పెంపునకు పలు రకాల పోటీలు నిర్వహించాలని, తద్వారా మాతృభాషపై మరింత విజ్ఞానం, పట్టు కలుగుతాయని పీఓ బి.రాహుల్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించిన వివిధ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి పోటీలతో పిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం వివిధ అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, జేడీఎం హరికృష్ణ, ఆర్సీఓ అరుణకుమారి, వివిధ విభాగాల ఉద్యోగులు రమేష్, రాములు, అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ, నారాయణరెడ్డి, కృష్ణార్జున, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ఉట్ల వేడుక

స్వామివారిని దర్శించుకున్న పలువురు



ఉట్ల వేడుకకు హాజరైన యాదవులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సన్నిధిలో ఉట్ల పండుగను మంగళవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం కృష్ణాష్టమి వేడుకలు ముగిసిన మరుసటి రోజున ఈ పండుగ జరపడం ఆనవాయితీ. ఇందులో భాగంగా పల్లకీలో స్వామి వారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి మేళతాళాల నడుమ చిత్రకూట మండపం వద్దకు తీసుకెళ్లారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన యాదవులు ఉట్లు కొట్టడంలో పోటీ పడ్డారు. అనంతరం స్వామి వారికి తిరువీధి సేవ నిర్వహించారు.

రామయ్య సన్నిధిలో ప్రముఖులు

శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, సిద్దిపేట జిల్లా గురునందానంద సరస్వతీ పీఠం నిర్వాహకులు మాధవానంద సరస్వతీ స్వామి, ఎస్పీ రోహిత్‌రాజ్ దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి వేద పండితులు, ఈఓ దామోదర్ రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

మెరుగైన విద్యుత్ సేవలందిస్తాం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మహేందర్

అశ్వారావుపేటరూరల్: వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ జి. మహేందర్ తెలిపారు. మండలంలోని నారాయణపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ, గృహ వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. భవిష్యత్‌లో పోడు భూముల సాగుతో పెరిగే విద్యుత్ లోడ్‌కు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌తో సబ్ స్టేషన్ పరిధిలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం కావడంతోపాటు విద్యుత్ అంతరాయాలు తొలగిపోతాయని వివరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ(ఆపరేషన్) నందయ్య, డీఈ(ఎంఆర్‌టీ) వెంకటేశ్వర్లు, ఏడీఈ వెంకట రత్నం, ఏడీఈ(టీఆర్‌ఈ) రాంబాబు, వినాయకపురం ఏఈ సంతోష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రి సీజ్



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

చుంచుపల్లి: విద్యానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్నారని ఆరోపణలు వచ్చిన అద్వైత ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ ఎస్.జయలక్ష్మి ఆదేశాల మేరకు బుధవారం ప్రోగ్రామ్ ఆఫీసర్ మధువరణ్, సిబ్బంది సందర్శించారు. నిర్దేశించిన ప్రమాణాలను పాటించడంలో ఆస్పత్రి యాజమాన్యం విఫలమైందని గుర్తించిన అధికారులు సీజ్ చేశారు. కనీస ప్రమాణాలను పాటించని ఆస్పత్రులు, క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో మహ్మద్ ఫయాజ్ మొహియుద్దీన్ ఉన్నారు.

కుక్కలను తీసుకొచ్చిన ట్రాలీ..

● పట్టుకున్న గ్రామస్తులు

అశ్వారావుపేటరూరల్: ఇతర ప్రాంతాల నుంచి వీధి కుక్కలను తీసుకొచ్చి తమ ప్రాంతంలో వదిలేస్తున్నారనే అనుమానంతో ఓ ట్రాలీ ఆటోను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన ఓ వ్యక్తి ట్రాలీ ఆటోలో నాలుగు కుక్కలను గొలుసులతో బంధించి స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వడ్డెర బజార్ సమీపంలో వదిలేందుకు యత్నించాడు. గమనించిన కొందరు స్థానికులు కుక్కలతో ఉన్న ట్రాలీ ఆటోను పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చి.. స్థానిక మున్సిపాలిటీ సిబ్బందికి ట్రాలీ ఆటోను అప్పగించారు. కాగా, మున్సిపాలిటీ అధికారుల విచారణలో సదరు వ్యక్తి పెంపుడు కుక్కలను పోషించ లేక ట్రాలీ ఆటోలో తీసుకొచ్చి వదులుతున్నట్లు గుర్తించారు. అనంతరం ట్రాలీ ఆటోను వదిలేసినట్లు అధికారులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రిక్షాకాలనీకి చెందిన వివాహిత అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పట్టణ ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. రిక్షాకాలనీకి చెందిన గుడివాడ లక్ష్మి (42) కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. మూడు రోజుల క్రితం తన పిల్లలను చూసుకోవాలని కోరుతూ తన అన్నయ్యకు సూసైడ్ నోట్ రాసింది. నోట్ చూసిన పిల్లలు తల్లికి సర్ది చెప్పారు. మనస్తాపం చెందిన ఆమె మంగళవారం మధ్యాహ్నం భర్త శ్రీనివాస్, ఇద్దరు కుమారులు ఇంట్లో లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోదావరిలో దూకిన వ్యక్తి..?

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి వంతెన పైనుంచి ఓ వ్యక్తి దూకినట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి.. వైట్ షర్ట్, ప్యాంట్ ధరించిన సుమారు 60 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి నదిలో దూకిన్నట్లు తెలిసింది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తులపై కేసు



నిందితులను చూపుతున్న పోలీసులు

ములకలపల్లి: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మధుప్రసాద్ కథనం మేరకు.. కొందరు గంజాయి సేవిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం కంపగూడెం క్రాస్‌రోడ్డు వద్ద దాడులు నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన సన్యా ముస్తాకిమ్, బిహార్‌కు చెందిన సర్వేశ్‌కుమార్ తోపాటు మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 99 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి

పాల్వంచరూరల్: కడుపునొప్పి తాళలేక ఏడు రోజుల క్రితం చేనులో పురుగుమందు తాగిన రైతులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లికి చెందిన రైతు భూక్యా ప్రసాద్ (36) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 9వ తేదీన చేనులో పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ప్రసాద్‌ను కుటుంబ సభ్యులు ద్విచక్రవాహనంపై ఉల్వనూరు పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అదే ద్విచక్రవాహనంపై పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

పామాయిల్ గెలలు 

టన్ను ధర	రూ.19,107

నేటి నుంచి పోషణ్ అభియాన్

మాతా, శిశు సంరక్షణే లక్ష్యంగా మాసోత్సవాలు

● గర్భిణులు, బాలింతులు, కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన సదస్సులు

● అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల పాటు కార్యక్రమాలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

చర్ల: సమగ్ర పోషకాహార పరిరక్షణ ద్వారా ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణాన్ని చేపట్టేందుకు ఏటా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 30 రోజుల పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషన్ అభియాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాగా, బుధవారం నుంచి అక్టోబర్ 16 వరకు జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పోషకాహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఐసీడీఎస్ ఇతర శాఖలు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో నిర్వహించే ఈ కార్యక్రమాలపై మండల, జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తుంటాయి.

ప్రధాన లక్ష్యాలు..

■ మాతా శిశు ఆరోగ్య పరిరక్షణ, గర్భిణులు, బాలింతలు, 0–6 ఏళ్ల పిల్లలకు సరైన పోషకాహారం, స్వచ్ఛత వంటి అంశాలపై దృష్టి.

■ మహిళలు, చిన్నారులకు ఆరోగ్యకరమైన, పోషకాలు ఉన్న ఆహారం అందించడం.

■ శిశువు జననానికి ముందు, జన్మించిన తరువాత రెండేళ్ల వరకు అందించాల్సిన పోషకాహారాలపై అవగాహన కల్పించడం.

■ మాసోత్సవ ప్రత్యేక అంశాలు..

■ అంగన్‌వాడీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యాచరణ చేపడతారు.

■ పిల్లల్లో ఉన్న పోషకాహార లోపాన్ని గుర్తించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలుండే ఆకుకూరలు, కూరగాయలు స్థానికంగా దొరికే ఇతర ఆహార పదార్థాల గురించి వివరించడం.

■ బాల్యంలో అధిక బరువు నివారణ, మంచి ఆహారపు అలవాట్లను గుర్తించి అలాంటి వాటికి ప్రోత్సాహకాలు అందజేయడం.

■ పోషణ ప్రతిజ్ఞ, ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, గృహ సందర్శనలు, పోషణ మేళాలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు.

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు	11
జిల్లాలోని మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	2061
7 నెలల నుంచి 3 ఏళ్ల వయస్సు గల పిల్లలు	30,738
3 నుంచి 6 ఏళ్ల వయస్సు గల పిల్లలు	26,217
గర్భిణులు	6,742
బాలింతలు	5,540

తొలి వారం కార్యాచరణ..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వంటల పోటీలు నిర్వహించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలను ఇచ్చే వంటకాలకు బహుమతులు అందజేస్తారు. మహిళలు, బాలికలకు బీఎంఐ పరీక్షలు నిర్వహించి పిల్లలు బరువు, ఎత్తు కొలుస్తారు.

రెండో వారం..

బిడ్డకు అందించే ముర్రుపాల విశిష్టత, అనుబంధ ఆహారంతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలి, ఆహారపు అలవాట్లపై అవగాన సదస్సులు నిర్వహిస్తారు. పిల్లల పోషణలో తండ్రుల భాగస్వామ్యం, పుట్టిన బిడ్డ మొదటి 1000 రోజుల్లో మెదడు అభివృద్ధి చెందే విధానంపై వివరిస్తారు.

మూడో వారం..

అత్యధికంగా పోషణ లోపమున్న పిల్లల్ని గుర్తించి వారికి పరీక్షలు నిర్వహిస్తారు. వృద్ధి పర్యవేక్షణకు హాజరు కాలేని పిల్లలను గుర్తించి వారి బరువు, ఎత్తు కొలిచేందుకు ఆశ కార్యకర్తలు వారి ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరిస్తారు.

నాలుగో వారం..

కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షల నిర్వహణ, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, తాగునీరు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, తక్కువ చక్కెర నూనెలతో తయారు చేసే వంటకాలను ప్రదర్శిస్తారు. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాల నిర్వహణ గురించి వివరిస్తారు. పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు.

విజయవంతం చేస్తాం..



జిల్లాలో అన్ని శాఖలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పోషణ్ అభియాన్ మాసోత్సవాన్ని విజయవంతం చేస్తాం. అన్ని ప్రాజెక్టుల్లో స్థానికంగా ఉండే అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు అందించాలని ప్రాజెక్టు అధికారులకు ఆదేశాలిచ్చాం. నెలరోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాం.

– స్వర్ణలత లెనినా, జిల్లా సంక్షేమ అధికారిణి

నాసిరకం ఆయిల్‌పామ్ విత్తనాలపై దర్యాప్తు జరపాలి



వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

అశ్వారావుపేటరూరల్: విదేశాల నుంచి నాసిరకం ఆయిల్‌పామ్ విత్తనాలు దిగుమతి చేసి తెలంగాణలోని నర్సరీల్లో పెంచడం ద్వారా రైతులకు నష్టం జరిగినందున సమగ్ర దర్యాప్తునకు సహకరించాలని తెలంగాణ ఆయిల్‌పామ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో జరిగిన అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) సమావేశంలో జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ దవాలే, వీజీ కృష్ణన్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ అంశంపై దర్యాప్తుతో పాటు రైతులకు పరిహారం అందించేలా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలాగే, పామాయిల్ గెలల టన్ను ధర రూ.25 వేలు ఉండేలా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని, ధర నిర్ణయంలో రైతు సంఘాలకు ప్రాతినిధ్యం దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు మహేశ్‌రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్యతో పాటు నాయకులు టి.సాగర్, బొంతు రాంబాబు, శోభన్, పి.జంగారెడ్డి, శ్రీనివాసులు, సోమయ్య, చందునాయక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వ్యాప్తంగా 'స్వచ్ఛతాహీసేవా'



మాట్లాడుతున్న టి.వెంకటరామిరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమం నిర్వహించాలని నోడల్ ఆఫీసర్, జీఎం (హెచ్‌ఆర్‌డీ) టి.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో కార్పొరేట్ ఏరియా సభ్యులతో ఆయన కార్యక్రమ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆఫీస్, గనులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 25వ తేదీన 'ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్' కార్యక్రమంలో భాగంగా సామూహిక శ్రమదానం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జీఎం(పర్సనల్) వెల్ఫేర్ – సీఎస్‌ఆర్ జీవీ కిరణ్‌కుమార్, ఆర్.కిరణ్‌రాజ్‌కుమార్, డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

తృటిలో తప్పిన ప్రమాదం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయిన లారీ

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని కమలాపురం గ్రామంలో వేగంగా వచ్చిన ఓ లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకోగా.. ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. మున్సిపాలిటీలోని కమలాపురం వైపు నడుస్తున్న ఇసుక రీచ్‌లకు వెళ్లే లారీలు అధిక వేగంతో వెళ్తుండటంతో రోడ్లు పాడవుతున్నాయని స్థానికులు ఇటీవల రాకపోకలను అడ్డుకున్నారు. అధికారుల సూచనలతో లారీల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇసుక రీచ్‌లకు వెళ్లే లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం పూర్తిగా కిందపడకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా ఇసుక తరలింపునకు ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

● తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో వేణుగోపాల్

కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్ నుంచి ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వస్తున్న ఆటోడ్రైవర్ కలాతురి వేణుగోపాల్ (49)ను బొగ్గు లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం హనుమాన్‌బస్తీకి చెందిన వేణుగోపాల్ ఆటో నడుపుతున్నాడు. సాయంత్రం రుద్రంపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్లి కూరగాయలు తీసుకుని వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వేణుగోపాల్‌ను టూటౌన్ సీఐ ప్రతాప్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రతాప్ తెలిపారు. లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అందరూ చూస్తుండగానే ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఉదయం కృష్ణా, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు వచ్చే సమయం కావడంతో ప్లాట్‌ఫాంలపై ప్రయాణికులు కిక్కిరిసి ఉన్నారు. అప్పటివరకు అందరితో కలిసి ఉన్న యువకుడు(28) పట్టాలపైకి దిగి వేగంగా వెళ్తున్న గూడ్స్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అంతా నిశ్చేష్టులయ్యారు. సదరు యువకుడి ఆచూకీ తెలియకపోగా, ఆయన కుడి చేయిపై త్రిశూలం టాటూ ఉందని జీఆర్పీహెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించామని పేర్కొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలు సీజ్



ఇసుక కుప్పలను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

బూర్గంపాడు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా సోంపల్లి గ్రామ సమీపంలో ఇసుకను నిల్వ చేశారు. మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీర్రాజు పరిశీలించి, అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దుప్పిని గాయపర్చిన కుక్కలు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం నీలాద్రి అర్బన్ పార్కు నుంచి జనావా సాల్లో వచ్చిన చుక్కల దుప్పిని వీధి కుక్కలు వెంటాడి గాయపరిచాయి. పార్కులో నుంచి మంగళవారం బయటకు వచ్చిన దుప్పి సింగరేణి ఓసీ మెయిన్‌గేట్ ప్రాంతానికి చేరింది. అక్కడ వీధికుక్కలు వెంట పడడంతో సింగరేణి సెక్యూరిటీ కుక్కల ను తరిమేశారు. అప్పటికే దుప్పి గాయపడడంతో ప్రాథమిక చికిత్స అనంతరం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కాగా, దుప్పిని రక్షించిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది విజేందర్, అయ్యప్ప, సుధాకర్, రామకృష్ణ, ప్రభాకర్, బాజిత్, జోసెఫ్‌ను పలువురు అభినందించారు.

మహిళకు జైలు శిక్ష

భద్రాచలంటౌన్: ఓ మహిళ మరో మహిళపై దాడి చేసి గాయపరిచిన కేసులో భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ దాడి చేసిన మహిళకు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. చర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన సోడి సుభద్రపై అదే గ్రామానికి చెందిన పూనెం రాధ దాడి చేసి గాయపరిచింది. సుభద్ర స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ ఎడాది ఏప్రిల్ 25న కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం కేసును విచారించిన న్యాయమూర్తి పూనెం రాధకు 6 నెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్‌లో కామర్స్ పరిశోధన కేంద్రం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలను మంగళవారం కాకతీయ యూనివర్సిటీ కామర్స్ ప్రొఫెసర్ల బృందం సందర్శించింది. కళాశాల కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని పరిశోధనా కేంద్రంగా గుర్తించేందుకు అవసరమైన లైబ్రరీ, ఈ–జర్నల్స్, ఇంటర్నెట్ సదుపాయం, అధ్యాపకుల అర్హతలను వారు సమీక్షించారని ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఈ బృందం చైర్మన్‌గా ప్రొఫెసర్ కట్ల రాజేందర్ వ్యవహరించగా, ప్రొఫెసర్లు హనుమంతరావు, పి.అమరవేణి, పి.వరలక్ష్మి, ఎస్.నరసింహాచారి, ఎం.యాదగిరి, కోలా శంకర్ ఉన్నారని వెల్లడించారు. ప్రొఫెసర్లు ఇచ్చే నివేదిక ఆధారంగా పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు అవకాశముంటుందని తెలిపారు. కాగా, కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జకీరుల్లా తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

కొత్తగూడెంఅర్బన్: హత్య కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం గణేశ్ టెంపుల్ ఏరియాలో 2022 అక్టోబర్ 24వ తేదీన బడికల సందీప్‌పై గాజుల రాజంబస్తీకి చెందిన పల్లం సాయికుమార్ (జగడం సాయికుమార్) ఉద్దేశపూర్వకంగా దాడి చేసి హత్య చేశారు. దీనిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న తర్వాత న్యాయమూర్తి.. నిందితుడు పల్లం సాయికుమార్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు షురూ



క్రీడా దుస్తులను అందజేస్తున్న జీఎం

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి వర్క్ పీపుల్ స్పోర్ట్స్, గేమ్స్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో కార్పొరేట్, కొత్తగూడెం ఏరియా ఉద్యోగులకు బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం (పర్సనల్) వెల్ఫేర్ (సీఎస్సార్) జీవీ కిరణ్‌కుమార్ హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఉద్యోగులు వారి పనులను నిర్వహిస్తూనే క్రీడల్లో ఆసక్తి చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు 2025 – 26 ఏడాదికి సంబంధించిన ఏకరూప దుస్తులు, క్రీడా సామగ్రి అందించారు. బాడి బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 23, 24 తేదీల్లో భూపాలపల్లి ఏరియాలో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలను ఈ నెల 25, 26 తేదీల్లో ఆర్‌జీ–3 ఏరియాలో జరిగే కంపెనీస్థాయి పోటీలకు ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏజే మురళీధర్‌రావు, కేసా నారాయణరావు, ఆర్.కేశవరావు, ఎస్వీ రమణమూర్తి, ఎస్.పితాంబరరావు, కె.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



మాట్లాడుతున్న సోమేశ్వర్‌గౌడ్

మణుగూరురూరల్: రాష్ట్రంలోని విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ బుర్ర సోమేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయొద్దన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కాంగ్రెస్ హయాంలోనే వచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బకాయిలను దశలవారీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జి.వెంకటేశ్వర్లు, పెనుగొండ సాంబశివరావు, పాదిల వీరబాబు, ఎన్.సతీశ్, పి.రవి, ముత్యం రమేశ్, కవిత, బింగి రమాదేవి, జయమ్మ, శాంతమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

తిరుమల సంకీర్తనలో దుమ్ముగూడెం వాసులు



సంకీర్తనలో పాల్గొన్న సభ్యులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన టీటీడీ హిందూ ధర్మ ప్రచారక్ పిలక నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణానికి చెందిన స్వర రాగ సుధ భజన మండలి కళాకారులు తిరుపతిలో జరిగిన అఖండ హరి నామ సంకీర్తనలో పాల్గొన్నారు. ఈ సంకీర్తనలో భాగంగా శ్రీరామ రక్ష స్తోత్రం హనుమాన్ చాలీసా 11 పర్యాయాలు, గోవిందనామాలు అన్నమయ్య సంకీర్తనలు, భజన పాటలు ఆలపించారు. కార్యక్రమంలో స్వర రాగ సుధ భజన మండలి అధ్యక్షులు జవ్వాజి వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొల్లు సునీత, సభ్యులు బేబీ, రామలక్ష్మి, అరుణ, సుశీల, నాగమణి, పద్మ, పద్మావతి పాల్గొన్నారు.

ఏపీ డీఎస్సీలో టేకులపల్లివాసికి ఉద్యోగం



ఊకే శిరోమణి

టేకులపల్లి: ఇటీవల ప్రకటించిన ఏపీ డీఎస్సీ ఫలితాలో టేకులపల్లి మండల ఆదివాసీ బిడ్డకు వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం లభించింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రాయిగూడెం పంచాయతీకి చెందిన ఊకే రాజేందర్‌రావు – లక్ష్మి దంపతుల కుమార్తె ఊకే శిరోమణి ఏపీలో డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో పరీక్ష రాసింది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో నాన్ లోకల్ కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఉద్యోగానికి ఎంపికైంది. మారుమూల గ్రామంలోని ఆదివాసీకి ఏపీ డీఎస్సీలో పీఈటీగా ఉద్యోగం రావడంపై గ్రామస్తులు అభినందించారు.

నేపాల్ తిరుగుబాటులో అమెరికా పాత్ర

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు



సదస్సులో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: నేపాల్‌లో తిరుగుబాటుకు రాజకీయ అస్థిరత్వం, అవినీతి అంతర్గత కారణాలుగా నిలిస్తే, దక్షిణాసియాలో చైనా ప్రభావాన్ని తగ్గించడానికి అమెరికా తదితర దేశాల చర్యలు బాహ్య కారణాలుగా ఉన్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు అన్నారు. ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. దక్షిణాసియాలో చైనా ప్రభావాన్ని నియంత్రించడానికి అమెరికా అదృశ్యశక్తిగా పనిచేస్తోందని తెలిపారు. నేపాల్‌లో దాడుల్లోనూ ఆ దేశ పాత్ర ఉందనే అనుమానాలు ఉన్నాయని చెప్పారు. కాగా, సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విద్రోహ దినమేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల అశోక్, శిరోమణి, శోభ, కె.శ్రీను, ఆజాద్, రాకేష్, లక్ష్మణ్, వెంకటేష్, లెనిన్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలకు 'వికసిత్ భారత్'

ఖమ్మంగాంధీచౌక్: ఉపాధి అవకాశాలు, సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అన్ని రంగాల్లో సామాజిక భద్రతను మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి వికసిత్ భారత్ ఉద్యోగ యోజనా పథకాన్ని రూపొందించారని వరంగల్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్–2 వైడీ.శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రయోజనాలు 2025 ఆగస్టు 1నుంచి 2027 జూలై 31 మధ్యకాలంలో సృష్టించబడిన ఉద్యోగాలకు వర్తిస్తాయని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా, ఈ పథకం రెండు భాగాలుగా ఉంటుందని, మొదటిభాగం ద్వారా తొలిసారి ఉద్యోగంలో చేరిన వారికి ప్రోత్సాహకంగా ఉంటుందని తెలిపారు. అన్ని వ్యవస్థీకృత రంగాల్లో కొత్తగా ఉద్యోగంలోకి వచ్చే వారికి వేతనం, కొంత భాగాన్ని నిర్దిష్ట కాలానికి ఖాతాలో నిల్వ చేయడం వంటివి అమలవుతాయని వెల్లడించారు. ఇక రెండో భాగం యజమానుల కోసం నిర్దేశించగా.. పలు అర్హతలను పొందుపరిచారని కమిషనర్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు.

దుకాణంలో చోరీ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్ ధన్‌బాద్ రోడ్డు పక్కన ఉన్న దుకాణంలో మంగళవారం చోరీ జరిగింది. దుకాణం యజమాని బి.శంకర్ కథనం ప్రకారం.. ధన్‌బాద్ రోడ్డు పక్కన దుకాణం నిర్వహిస్తుంటానని, రోజులాగానే దుకాణం తెరిచేందుకు రాగా తాళం పగులగొట్టి ఉండటం, లోపల సామగ్రి లేకపోవడం, క్యాష్ కౌంటర్‌లో రూ.2 వేలు కూడా పోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నానని తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు శంకర్ వెల్లడించారు.